మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 196 | ఆదివారం | 18 - 01 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## జర్నలిస్టులకు నిత్యావసర సరుకులు పంపిణీ



3లో..

# మూలాలు మరిచిపోవద్దు: సీఎం చంద్రబాబు

- ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మరచిపోవద్దు: ముఖ్యమంత్రి చంద్రబాబు
- గ్రీన్ అమ్మోనియా పరిశ్రమకు శంకుస్థాపన
- కాకినాడ వైపు ప్రపంచం చూపు
- ఆంధ్రప్రదేశ్‌కు గేమ్ చేంజర్‌గా పరిశ్రమ




కాకినాడ జిల్లా, జనవరి 17, మన గళం,:: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం కాకినాడలో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఇంధన రంగంలో ఇది చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ప్రపంచం మొత్తం కాకినాడ వైపు చూస్తుందన్నారు. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మన సంస్కృతిని కాపాడుకుంటూనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

2 లో..

## పురుషులకు సైతం ఫ్రీ బస్ ప్రయాణం



- ఏఐడీఎంకే ఎన్నికల మేనిఫెస్టో విడుదల
- మహిళలకు నెలకు రూ.2,000 ఆర్థిక సహాయం
- ఉచిత ప్రయాణం, గృహాలు, ఉపాధి హామీపై కీలక హామీలు

చెన్నై, జనవరి 17 మన గళం,: తమిళనాడులో రానున్న అసెంబ్లీ ఎన్నికల

2 లో..

## హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి మనందరి ఉమ్మడి లక్ష్యం

- బ్రహ్మపూర్--విశాఖపట్నం రైలు నూతన హాల్ట్ ప్రారంభం
- హరిశ్చంద్రపురంలో కీలక రైళ్ల నిలుపుదలపై వినతిపత్రం
- స్టేషన్ అభివృద్ధిపై రైల్వే అధికారుల సానుకూల స్పందన



తిలారు, జనవరి 17 మన గళం : తిలారు రైల్వే స్టేషన్‌లో బ్రహ్మపూర్--విశాఖపట్నం రైలు సర్వీసుకు నూతన హాల్ట్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడుతో కలిసి రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి మనందరి ఉమ్మడి

2 లో..

## దళిత యువకుడి హత్యపై వైయస్ఆర్ సీపీ ఆగ్రహం



- అంబేద్కర్ జంక్షన్ వద్ద ధర్నా
- కూటమి ప్రభుత్వంపై ధర్మాన కృష్ణదాస్ విమర్శలు
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

శ్రీకాకుళం, జనవరి 17 మన గళం : పల్నాడు జిల్లా పిన్నెల్లిలో దళిత యువకుడు మందా సాల్మన్‌ను పాశవికంగా హత్య చేసిన ఘటనను నిరసిస్తూ శనివారం శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ నాయకత్వం వహించారు.

ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ, కూటమి

2 లో..

## పశ్చిమ బెంగాల్‌లో జనాభా సమతుల్యత దెబ్బతింటోంది: ప్రధాని మోదీ



- మాట్లాడే భాషలోనూ మార్పులు వస్తున్నాయని వ్యాఖ్య
- చొరబాటుదారుల పెరుగుదలతో అల్లర్లు జరుగుతున్నాయన్న ఆరోపణ
- మాల్దా, ముర్షిదాబాద్ ప్రాంతాలను ఉదాహరణగా ప్రస్తావన

న్యూఢిల్లీ, జనవరి 17 మన గళం,: పశ్చిమ బెంగాల్‌లో అనేక ప్రాంతాల్లో జనాభా సమతుల్యత తీవ్రంగా దెబ్బతింటోందని ప్రధాని నరేంద్ర

2 లో..

## సింగపూర్ చేరుకున్న భారత నౌకాదళ తొలి శిక్షణా దళం



- చాంగీ నావల్ బేస్‌లో నౌకల రాక
- దక్షిణ తూర్పు హిందూ మహాసముద్ర ప్రాంతంలో శిక్షణా మోహరింపు
- నౌకాదళ శిక్షణలో భాగంగా అంతర్జాతీయ ప్రయాణం

సింగపూర్, జనవరి 17, మన గళం,: భారత నౌకాదళానికి చెందిన తొలి శిక్షణా దళం జనవరి 15న సింగపూర్‌లోని చాంగీ నావల్

2 లో..

## బలమైన సంకల్పం ఉంటే ఏదైనా సాధించగలం: డిప్యూటీ సీఎం పవన్

కాకినాడ, జనవరి18:మన గళం,: బలమైన సంకల్పం ఉంటే ఏదైనా సాధించగలమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడలో రూ.18వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. 'అనేక కష్టనష్టాలను తట్టుకుని ఏఎం గ్రీన్ కంపెనీపెట్టారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ముందుకెళు_న్నాం. గ్రీన్ హైడ్రోజన్ దిశగా మనం వేసే అడుగులు చాలా ముఖ్యమైనవి. ఈ గ్రీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాము' అని పవన్ అన్నారు.

2 లో..



# పురుషులకు సైతం ఫ్రీ బస్ ప్రయాణం

నేపథ్యంలో అన్నాడీఎంకే పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ఈ మేనిఫెస్టోలో మహిళలతో పాటు పురుషులకు కూడా సిటీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని పార్టీ ప్రకటించడం రాజకీయంగా విశేష చర్చకు దారి తీసింది.

మహిళల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ప్రతి మహిళకు నెలకు రూ.2,000 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలతో పరిమితం చేయకుండా పురుషులకు కూడా వర్తింపజేస్తామని పేర్కొంది.

అమ్మ టూ వీలర్ పథకం కింద ఐదు లక్షల మందికి ద్విచక్ర వాహనాల కొనుగోలుపై రూ.25,000 సబ్సిడీ అందిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో భూమి ఉన్న లబ్ధిదారులకు కాంక్రీట్ ఇండ్ల నిర్మాణం చేపడతామని తెలిపింది.

ఉపాధి హామీ పథకంలో పని దినాలను 100 రోజుల నుంచి 150 రోజులకు పెంచుతామని హామీ ఇచ్చింది. తమిళనాడులో సంక్షేమం, ఉపాధి, రవాణా రంగాల్లో ప్రజలకు మరింత మేలు చేసే విధంగా తమ పాలన సాగుతుందని ఏఐడీఎంకే పార్టీ స్పష్టం చేసింది.

# మూలాలు మరిచిపోవద్దు: సీఎం చంద్రబాబు






ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మరచిపోవద్దని ఆయన పిలుపునిచ్చారు. గతంలో నాగార్జున ఎరువుల పరిశ్రమ ఏర్పాటులో దివంగత ఎన్టీఆర్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ పరిశ్రమలో ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమ్మోనియాను జర్మనీ, జపాన్, సింగపూర్ వంటి దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా భారత్ గొప్ప ఇంధన ఎగుమతిదారుగా ఎదుగుతుందని అన్నారు. బొగ్గు వినియోగం వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లడమే కాకుండా ప్రాణాలకు ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి గ్రీన్ ఇంధన ఉత్పత్తిని పెంచాలని ప్రధాని కోరుతున్న దిశగా రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. రెండు వేల పద్నాలుగులో తమ ప్రభుత్వం గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాకు నాంది పలికిందని ముఖ్యమంత్రి తెలిపారు. సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్‌లో ఇరవై పోర్టులు రానున్నాయని, రెండు వేల ఇరవై ఏడు జూన్ నాటికి మొదటి ఉత్పత్తి ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు వేల ఆరు వందల మందికి ఉపాధి కల్పిస్తుందని, రెండు వేల నలభై ఏడేళ్ల నాటికి ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# పశ్చిమ బెంగాల్‌లో జనాభా సమతుల్యత దెబ్బతింటోంది: ప్రధాని మోదీ



మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలతో మాట్లాడినప్పుడు, రోజువారీ మాట్లాడే భాషలో కూడా మార్పులు వస్తున్నాయని వారు తనకు చెబుతున్నారని అన్నారు.

చాలా ప్రాంతాల్లో భాష, ఉపభాషల మధ్య తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. ఇది కేవలం సాంస్కృతిక మార్పు మాత్రమే కాకుండా, రాష్ట్రంలో జరుగుతున్న లోతైన జనసాంఖ్యిక మార్పులకు సంకేతమని వ్యాఖ్యానించారు.

చొరబాటుదారుల సంఖ్య పెరుగుతున్న కారణంగా పశ్చిమ బెంగాల్‌లోని అనేక ప్రాంతాల్లో అల్లర్లు మొదలయ్యాయని ప్రధాని ఆరోపించారు. ముఖ్యంగా మాల్దా, ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారిందని తెలిపారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు, సామాజిక సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత పాలకులదేనని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రజల భద్రత, సాంస్కృతిక స్వరూపాన్ని పరిరక్షించడంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు.

# హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి మనందరి ఉమ్మడి లక్ష్యం



లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్‌ను ఆధునికంగా అభివృద్ధి చేయాలని, స్థానిక ప్రయాణికుల అవసరాల దృష్ట్యా కీలక రైళ్లను అక్కడ నిలుపుదల చేయాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. గుణుపూర్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్--విశాఖపట్నం ఇంటర్‌సిటీ, పూరీ--తిరుపతి ఎక్స్‌ప్రెస్, విశాఖ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను హరిశ్చంద్రపురంలో ఆపాలని కోరారు. అలాగే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు.

స్టేషన్ సమీపంలోని సుమారు 40 ఎకరాల ప్రభుత్వ స్థలంలో రైల్వే గొడౌన్లు లేదా ఆర్‌పీఎఫ్ క్వార్టర్స్ నిర్మించడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు రైల్వేకు అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

ఈ అంశాలపై రైల్వే ఉన్నతాధికారులు, డీఆర్ఎం లలిత్ బోహ్రా సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. ప్రాంత ప్రయాణికుల ఇబ్బందులు తొలగించి, హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారే వరకు తమ కృషి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.


# సింగపూర్ చేరుకున్న భారత నౌకాదళ తొలి శిక్షణా దళం



బేస్‌కు చేరుకుంది. ఈ శిక్షణా దళంలో ఐఎన్ఎస్ తిర్, ఐఎన్ఎస్ శార్దుల్, ఐఎన్ఎస్ సుజాత నౌకలతో పాటు భారత తీర రక్షక దళానికి చెందిన ఐసీజీఎస్ సారథి నౌక ఉన్నాయి. దక్షిణ తూర్పు హిందూ మహాసముద్ర ప్రాంతంలో శిక్షణా మోహరింపులో భాగంగా ఈ దళం సముద్ర ప్రయాణం చేపట్టింది. యువ నావికాధికారులకు సముద్ర ప్రయాణ అనుభవం, నావిగేషన్ నైపుణ్యాలు, సముద్ర భద్రతపై ప్రాయోగిక శిక్షణ అందించడం ఈ మోహరింపుకు ప్రధాన ఉద్దేశ్యం. ఈ శిక్షణా ప్రయాణం ద్వారా ప్రాంతీయ సముద్ర భద్రతకు భారత నౌకాదళం కట్టుబాటును మరింత బలపరుస్తోంది. ఇతర దేశాల నౌకాదళాలతో పరస్పర అవగాహన, సహకారాన్ని పెంపొందించుకోవడం కూడా ఈ మోహరింపులో కీలక అంశంగా ఉంది.

హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, భద్రతను పరిరక్షించడంలో భారత నౌకాదళం పోషిస్తున్న పాత్రను ఈ శిక్షణా దళం మోహరింపు స్పష్టంగా ప్రతిబింబిస్తోంది.

# దళిత యువకుడి హత్యపై వైయస్ఆర్ సీపీ ఆగ్రహం




ప్రభుత్వ పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. సాల్మన్ హత్య అత్యంత అమానుషమని పేర్కొంటూ, రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని తీవ్ర విమర్శలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళితులపై జరుగుతున్న దాడులను సహించబోమని స్పష్టం చేస్తూ, పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ అంశంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ ధర్నాలో ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, అందవరపు సూరిబాబు, గేదెల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ, దళితుల హక్కులను కాలరాస్తున్నారని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని వారు ఆరోపించారు.

# బలమైన సంకల్పం ఉంటే ఏదైనా సాధించగలం: డిప్యూటీ సీఎం పవన్

'కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో ఇదో మైలురాయి. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో అనేక ప్రాజెక్టులు వస్తున్నాయి. ఏఎం గ్రీన్ కంపెనీ రాష్ట్ర సుస్థిరాభివృద్ధిలో గేమ్ ఛేంజర్ కానుంది. ఈ ప్రాజెక్టు వల్ల వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతారు. గత ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తల ఇబ్బందులు తెలుసు. గత ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలను వేధించారు. పార్టీలు మారవచ్చు. కానీ, ప్రభుత్వ వ్యవస్థ శాశ్వతం' అని డిప్యూటీ సీఎం పవన్ అన్నారు. గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్‌ను ఏఎం గ్రీన్ సంస్థ కాకినాడలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్‌కు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. రూ.13వేల కోట్లతో 495 ఎకరాల్లో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. ఏటా 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అలాగే.. ఏఎం గ్రీన్ సంస్థ ఏటా 1,950 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్‌ను ఉత్పత్తి చేయనుంది. జర్మనీ, జపాన్, సింగపూర్‌కు గ్రీన్ అమ్మోనియాను ఎగుమతి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,600 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# సమసమాజ స్థాపనకు జీవితాన్ని అంకితం చేసిన జ్యోతిబాస్

మనగళం, కర్నూలు సిటీ : ఆదర్శ కమ్యూనిస్టు జ్యోతిబాసు 16వ వర్ధంతి కార్యక్రమం కేకే భవన్ లో సీపీఎం నగర కార్యదర్శి టి రాముడు అధ్యక్షతన నిర్వహించారు. నాయకులు,కార్యకర్తలు జ్యోతిబాసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి ఆనంద్ బాబు, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఆర్ నరసింహులు జ్యోతిబాసు సేవలను గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో 23 సంవత్సరాలు ఏకధాటిగా ఐదు పర్యాయాలు ముఖ్యమంత్రిగా తిరుగులేని కమ్యూనిస్టు యోధుడిగా అశేష ప్రజానీకం కార్మిక వర్గం ఆశాజ్యోతి గా మన్ననలు పొందిన గొప్ప నాయకుడు కొనియాడారు. ప్రతి పేదవాడికి భూమి ఇవ్వాలనే నినాదంతో లక్షలాది ఎకరాలను భారతదేశంలో ఏ రాష్ట్రము కూడా ఇవ్వనన్ని భూములను పేదలకు పంచి ఆదర్శ కమ్యూనిస్టు గవర్నమెంట్ గా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గురుశేఖర్ దేవ సహాయం, రాజు, నగేష్, సిహెచ్ సాయిబాబా, కే సుధాకరప్ప,



భాస్కర్, ఏసు, రోషి, జయమ్మ విజయమ్మ, బంగి పద్మ, ఎల్ల గురువే, యోగేంద్ర, బతుకమ్మ, శంకర్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి చివరికి సివిల్ పనులను పూర్తి చేయాలి

**– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్, ఏపిఎంఎస్ఐడిసి, ఏపిఈడబ్ల్యూఐడిసి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (ఎంఏ అండ్ యూడీ) తదితర శాఖలు చేపడుతున్న సివిల్ పనులు ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో సివిల్ పనుల పురోగతి, క్వాలిటీ కంట్రోల్ అంశాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులు వృథా చేయకుండా, ఫిబ్రవరి చివరి నాటికి మొత్తం నిధులను ఖర్చు చేయాలని సూచించారు. నిర్మాణ పనులలో కచ్చితంగా నాణ్యతను పాటించాలని, క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలన్నారు. అదే విధంగా బిల్లులు ఆన్లైన్ లో అప్లోడ్ చేయించే ప్రక్రియ కూడా ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్



ఇంజినీర్ లు ధనిబాబు, భాస్కర్ రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్ పాల్గొన్నారు.

# కేవీపీయస్ క్యాలెండర్ ఆవిష్కరణ

మనగళం, కర్నూలు సిటీ : సామాజిక ఆర్థిక రాజకీయ అంతరాలు లేని సమాజ నిర్మాణం కోసం సామాజిక, అభ్యుదయ శక్తుల ఐక్యతతో అంతరాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఉద్యమిద్దామని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ దేవసహాయం, ఎండి ఆనంద్ బాబు పిలుపునిచ్చారు. శనివారం కర్నూల్ నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కార్మిక కర్షక భవన్లో కేవీపీఎస్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు కేవీపీఎస్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి విజయమ్మ, బి కరుణాకర్, ఎన్ జి కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం భాస్కర్, మాజీ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు కర్నూల్ ఓల్డ్ సిటీ అధ్యక్షులు రమణ, న్యూ సిటీ అధ్యక్షులు ఏసురాజు, ఆదోని అధ్యక్షులు మునుస్వామి, కల్లూరు, వెల్దుర్తి,



కోడుమూరు, ఓర్వకల్, సి బెలగల్ మండలాల కార్యదర్శులు గోపాల్, నాగరాజు, ప్రకాశం, రామకృష్ణ, నాగన్న, కోసిగి మండల ఉపాధ్యక్షులు ఫిలిప్, నాయకులు రోషన్న, సువార్తమ్మ, సుధాకరప్ప, ఆంజనేయులు, బైరాపురం కృష్ణ, ప్రదీప్, కేసన్న, జోజప్ప, పులుకూరి బాబురావు, జాన్సన్, రత్నం, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# వృర్ధాల నిర్వహణ వ్యవస్థను పటిష్టపరిచాలి

**– పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్ షిప్ ల ప్రాజెక్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి – కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ పటిష్టత, పబ్లిక్, ప్రైవేట్, భాగస్వామ్య ప్రాజెక్టుల ఏర్పాటు పై చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లో సర్క్యులర్ ఎకానమీ,పబ్లిక్, ప్రైవేట్, భాగస్వామ్య ప్రాజెక్టుల ఏర్పాటు పై కలెక్టర్ అధికారుల తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై చర్చించారు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం ( పిపిపి ) ద్వారా ప్రాజెక్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హొటళ్లు, ఉద్యోగాలు కల్పించే సంస్థలు, పరిశ్రమలు, రిక్రియేషన్ సెంటర్ లు తదితర ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో కర్నూల్ మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, పరిశ్రమల శాఖ జీఎమ్ జవహర్ బాబు, సీపీఓ భారతి, డీపీఓ భాస్కర్, మెప్మా పీడీ శ్రీనివాసులు, డీఆర్డీఏ ఏపీడీ నరసమ్మ, ఏపీఎంఐపీ పీడీ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్య భద్రతకు కూటమి సర్కార్ అండా



మనగళం, కర్నూలు సిటీ : పేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన మిద్దె శివ శంకర్ కి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన ఆర్థిక సహాయాన్ని ఆయన నగరంలోని తన కార్యాలయంలో అందజేశారు. శివ శంకర్ ఇటీవల కిడ్నీ కి సంబంధించిన సమస్యతో బాధపడుతూ ఓ ప్రైవేట్ అసువత్రి లో చికిత్స పొందాడు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం ఎంపీ నాగరాజును సంప్రదించి ఆయన సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.1,72,027 మంజూరయ్యాయి. సీ.ఎం.ఆర్.ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడానికి కృషి చేసిన ఎంపీ కి లబ్ధిదారుడు కృతజ్ఞతలు తెలిపాడు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురువ కార్పొరేషన డైరెక్టర్ పర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు

# జర్నలిస్టులకు నిత్యావసర సరుకులు పంపిణీ



మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ లో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టులకు ఇంజనీరింగ్ కళాశాలల రాష్ట్ర ఉపాధ్యక్షులు, కె వి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల అధినేత కెవి సుబ్బారెడ్డి తన నివాసంలో నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ బ్లాక్ మెయిల్ లకు పాల్పడకుండా జర్నలిస్టు లు సమాజంలో చెడును పార దోలాలని సూచించారు. అవినీతి లేని సమాజ స్థాపనకు పాటుపడాలని, ఉన్నది ఉన్నట్టుగా వార్తలు రాయాలని కోరారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని జర్నలిస్టులకు నిత్యావసర సరుకులు అందజేసిన కె.వి సుబ్బారెడ్డి కి ఈ సందర్భంగా జర్నలిస్టులు రామస్వామి రంగ కృతజ్ఞతలు తెలిపారు.

# అర్జీలను పత్వరితగతిన పరిష్కరించాలి

**– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

మనగళం, కర్నూలు సిటీ : రెవెన్యూ క్లినిక్ లు, స్పెషల్ క్యాంప్ ల ద్వారా వచ్చిన అర్జీలను పత్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి డిఆర్ఓ ను ఆదేశించారు. శనివారం ఉదయం రెవెన్యూ సమస్యలు, ఏపీఐఐసి అంశాల పై కలెక్టర్ డిఆర్ఓ, ఆర్డీఓలు, ఏపీఐఐసి అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రెవెన్యూ క్లినిక్ లు, స్పెషల్ క్యాంప్ ల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారానికి సంబంధించి పురోగతిని డీఆర్వో, ఆర్డీవో లను అడిగి తెలుసుకున్నారు. పత్తికొండ, కర్నూలు ఆర్డీఓ కార్యాలయాలలో నిర్వహించిన రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్ లలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. త్వరలో ఆదోని డివిజన్ కు సంబంధించిన రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్ ను కూడా నిర్వహించి పెండింగ్ లో ఉన్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఆర్ఓ, ఆర్డీవో లకు సూచించారు. టెలికాన్ఫరెన్స్ లో డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, ఆదోని ఆర్డీఓ అజయ్ కుమార్, ఏపీఐఐసి జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు

మనగళం, కర్నూలు సిటీ : సంక్రాంతి పండుగ సందర్భంగా కర్నూల్ పట్టణంలోని బుధవారపేట శివాలయం సర్కిల్ నందు కేవీపీఎస్, సీఐటీయూ ఓల్డ్ సిటీ కమిటీల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయి సంక్రాంతి పండగ ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు, పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, ఎన్జీ కృష్ణ, రెడ్డిపోగు రమణ, పద్మ, మహేశ్వరి, మహమ్మద్,రామకృష్ణ, యు.కళావతి, ప్రసాద్,మహేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.





# మహిళల సమస్యలపై నిర్లక్ష్యం తగదు





మనగళం, కర్నూలు సిటీ : మహిళల సమస్యలపై పోలీసులు నిర్ల్యక్ష్యంగా వ్యవహరించడం తగదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి హెచ్చరించారు. కర్నూలు బి క్యాంపులోని ఐక్య వేదిక ప్రధాన కార్యాలయం లో రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యవర్గ సమావేశానికి పట్నం రాజేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బాధిత మహిళలు స్టేషన్ ల చుట్టూ నెలల తరబడి తిరుగుతున్న పోలీసులు నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జంగిటి వర్షిత అను మహిళ తన భర్త వేధింపులపై బేతంచర్ల పోలీసులకు ఫిర్యాదు చేసి మూడు నెలలుగా స్టేషను చుట్టూ తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే రామళ్ళకోట గ్రామానికి చెందిన అంగం జయమ్మ ను కోడలు మానసికంగా వేధిస్తూ దౌర్జన్యంగా ఇంటి నుండి గెంటి వేస్తే బాధితురాలు వెల్దుర్తి పోలీసులను ఆశ్రయించినా స్పందన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత మహిళలు నెలల తరబడి పోలీసు స్టేషనుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం అందడం లేదని, వారికి అండగా ఐక్యవేదిక పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి మహిళా ఐక్య వేదిక నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం గురించి వివరించారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు మండల గ్రామ కమిటీలను వేసి మహిళలను ఏకం చేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్షురాలు వగ్గా ఈరమ్మ, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు కటికే భాను, కర్నూలు జిల్లా ఉపాధ్యక్షురాలు హుస్సేన్ బీ, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు ఆకుతోట పద్మావతి, ఆదోని డివిజన్ అధ్యక్షురాలు ఎలీశమ్మ, మరియమ్మ , కొమ్ము పెద్దక్క, కమ్మరి లక్ష్మి , ఖాసీంబీ, రంగమ్మ, షేకూన్ బీ,మరియమ్మ , రేవతి దస్తగిరమ్మ , సింధూజ, అమీనా, చిరంజీవమ్మ , కళావతి, ఖాజాబీ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

**కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



మనగళం, కర్నూలు సిటీ : జిల్లాలో రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా మండల స్థాయిలో కార్యాచరణ వ్యవసాయ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఈ క్రాప్ బుకింగ్, రైతు సేవా కేంద్రాల యాక్షన్ ప్రణాళిక తదితర అంశాలపై వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులతో, మండల వ్యవసాయ శాఖ అధికారులతో, రైతు సేవ కేంద్రం అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఉల్లి, పత్తి పంటల సేకరణలో ఎదురైన సాంకేతిక మరియు ఇతర సమస్యలను దృష్టిలో ఉంచుకుని, రాబోయే కందులు, శనగలు, మిర్చి పంటల విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పంట సేకరణ ప్రక్రియలో రైతులు ఇబ్బంది పడకుండా, ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడడమే తన ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.. రైతులు సాగు ప్రారంభం చేసినప్పటి నుండి పంట మార్కెటింగ్ వరకు ఎదుర్కొనే ప్రతి అంశాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి సమస్యలకు ముందస్తు పరిష్కారాలతో కూడిన స్పష్టమైన యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు.. రైతు సేవా కేంద్రాల ద్వారా అమలు చేయాల్సిన ప్రణాళిక గురించి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు... రైతు సేవా కేంద్రాల స్థాయిలో ఉండే అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్ వారి పరిధిలో అమలు చేస్తున్న వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు బాధ్యత వహించాలన్నారు...ఈ--క్రాప్ బుకింగ్ నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎల్లెల్సీ నుండి నీరు ఆగిపోయిందని, దీని గురించి మేము 2 నెలల ముందే చెప్పామని, సంబంధిత విషయం గురించి రైతులకు మీరు చెప్పకపోతే సంబంధిత అధికారులు బాధ్యత వహిస్తారన్నారు. సుంకేసుల బ్యారేజ్ లేదా గాజులదిన్నె ప్రాజెక్ట్ సమీపంలో వరి సాగును ప్రోత్సహించవద్దన్నారు. వరికి నీరు చాలా ఎక్కువ అవసరమని, వరి పంట కాకుండా ఇతర పంటలను ప్రోత్సహించాలన్నారు. గత ఏడాది ఉల్లి పంట విషయంలో చాలా సమస్యలు వచ్చాయన్నారు. అందు వల్ల ఈ అంశంలో రైతులను చైతన్యవంతం చేయాలన్నారు. గరైతులకు సబ్సిడీపై డిబ్లర్లు, డ్రిప్, రైజ్డ్ బెడ్ మెషీన్లను 70 శాతం సబ్సిడీ తో అందించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు.. ఈ సాగు విధానాన్ని ప్రభుత్వానికి ప్రతిపాదించామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు ఆమోదం చేయగానే అందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఉద్యానవన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అరుణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# వారెవ్వా అదిరే బైక్.. తక్కువ ధర.. ఎక్కువ మైలేజీ..

హైదరాబాద్ -- 17 జనవరి -- మనగళం, నేటి కాలంలో బైక్ అనేది కేవలం ప్రయాణ సాధనం మాత్రమే కాదు.. యువతకు స్టైల్‌కు ప్రతీకగా మారింది. ముఖ్యంగా పల్సర్ బ్రాండ్ అంటేనే పవర్, లుక్, విశ్వసనీయత అన్న భావన ఉంది. అయితే పెద్ద బైక్ కొనాలంటే ఎక్కువ ఖర్చు అవుతుందనే భయం చాలామందిలో ఉంటుంది. అలాంటి వారికోసం బజాజ్ సంస్థ పల్సర్ 125 నియాన్ బైక్‌ను తక్కువ ధరలో మార్కెట్లోకి తీసుకొచ్చింది. కాలేజీ విద్యార్థులు, ఉద్యోగులకు అనువుగా ఈ బైక్ మంచి ఆదరణ పొందుతోంది.

ఈ బైక్ ధర సామాన్యుడికి అందుబాటులో ఉండడం ప్రధాన ఆకర్షణగా మారింది. షోరూమ్ ధర సుమారు 79048 నుంచి ప్రారంభమవుతుంది. నగరాన్ని బట్టి రోడ్డు మీద ధర సుమారు 85633 నుంచి 92414 వరకు ఉంటుంది. లక్ష రూపాయల లోపు స్టైలిష్ బైక్ కావాలనుకునే వారికి ఇది చక్కని ఎంపికగా మారుతోంది.

పల్సర్ 125 నియాన్‌లో శక్తివంతమైన ఇంజిన్ అమర్చారు. ఇది మంచి వేగంతో పాటు సాఫీగా ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉంది. నగర రద్దీ రోడ్లపై సులభంగా నడిచేలా, హైవేలపై కూడా స్థిరంగా ప్రయాణించేలా ఈ బైక్ రూపకల్పన చేశారు. వేగం, నియంత్రణ రెండింటిలోనూ ఇది వినియోగదారులను ఆకట్టుకుంటోంది.

మైలేజీ విషయంలో కూడా ఈ బైక్ అదిరిపోయే ఫలితాలను ఇస్తోంది. లీటర్ పెట్రోల్‌తో సుమారు 50 నుంచి 57 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. ట్యాంక్ పూర్తిగా నింపితే దాదాపు 550 నుంచి 600 కిలోమీటర్ల దూరం వెళ్లే అవకాశం ఉంటుంది. పెట్రోల్ ఖర్చు తగ్గించుకోవాలనుకునే వారికి ఇది పెద్ద లాభంగా మారుతోంది.

భద్రత, సౌకర్యాల విషయంలో కూడా ఎక్కడా రాజీ పడలేదు. ముందు చక్రానికి బలమైన బ్రేక్ వ్యవస్థ, జారకుండా కాపాడే భద్రతా సాంకేతికత, కుదుపులు తక్కువగా ఉండే షాక్ వ్యవస్థ, ట్యూబ్‌లెస్ టైర్లు అందుబాటులో ఉన్నాయి. డిజిటల్ మీటర్‌తో అవసరమైన సమాచారం స్పష్టంగా కనిపించేలా రూపొందించారు.

కాలేజీకి వెళ్లే విద్యార్థులు, రోజూ ఆఫీసుకు ప్రయాణించే ఉద్యోగులు, తక్కువ నిర్వహణ ఖర్చుతో మంచి స్టైల్ కోరుకునే యువతకు ఈ బైక్ ఉత్తమ ఎంపికగా మారుతోంది. తక్కువ ధర, మంచి మైలేజీ, ఆకర్షణీయమైన లుక్ కలగలిసిన పల్సర్ 125 నియాన్ ప్రస్తుతం మార్కెట్లో హాట్ ఫేవరెట్‌గా నిలుస్తోంది.

# గార్గేయపురంలో పల్లె మహేశ్వర్ రెడ్డి మృతి

**- వైయస్ఆర్‌సీపీ కోడుమూరు ఇంచార్జి డా. ఆదిమూలపు సతీష్ గారు నివాళులు**



మన గళం కర్నూలు: కోడుమూరు నియోజకవర్గం లోని కర్నూలు మండలం గార్గేయపురం గ్రామానికి చెందిన పల్లె మహేశ్వర్ రెడ్డి ఆకాల మరణం పట్ల వైయఅబశ్రీశ్రీస్ఆర్‌సీపీ కోడుమూరు నియోజకవర్గం ఇంచార్జి శ్రీ డాక్టర్ ఆదిమూలపు సతీష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈ సందర్భంగా డా. సతీష్ మాట్లాడుతూ, పల్లె మహేశ్వర్ రెడ్డి అకాల మరణం పార్టీకి, గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబానికి పార్టీ తరపున పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గం ఎంప్లాయిస్ అండ్ పెన్షన్ విభాగం అధ్యక్షులు వజ్జల రామకృష్ణ యాదవ్, దిగుపాడు గ్రామానికి చెందిన భద్రారెడ్డి, అలాగే గ్రామ నాయకులు ఆర్. యేసేపు, టి. సురేష్, కోటేశ్వర్ రెడ్డి, పీ.మద్దిరెడ్డి, సుభాన్ భాష తదితరులు పాల్గొని మృతునికి నివాళులు అర్పించారు.

గ్రామ నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై పల్లె మహేశ్వర్ రెడ్డి కుటుంబానికి తమ సానుభూతిని తెలిపారు.

# సొంతూరిలోనే సింపుల్ వ్యాపారం..



హైదరాబాద్ -- 17 జనవరి -- మనగళం, ఉద్యోగం కోసం తిరిగి తిరిగి ప్రయత్నించి విసిగిపోయారా.. జాబ్ రాలేదని బాధపడుతున్నారా అంటే ఇక టెన్షన్ అవసరం లేదు. మీ సొంతూరిలోనే తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం వచ్చే వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు. ప్రస్తుతం బాగా ట్రెండ్ అవుతున్న వ్యాపారం ఫుడ్ వ్యాపారం. ముఖ్యంగా మొబైల్ టిఫిన్ సేవ మంచి లాభాలను ఇస్తోంది.

నగరాలతో పాటు గ్రామాల్లో కూడా ఉదయం, సాయంత్రం వేడి వేడి టిఫిన్‌కు మంచి డిమాండ్ ఉంది. ఇంట్లో పరిశుభ్రంగా తయారు చేసిన ఆహారాన్ని నేరుగా ప్రజల వద్దకు తీసుకెళ్లే విధానం వినియోగదారులను ఆకర్షిస్తోంది. బైక్ సహాయంతో టిఫిన్ సరఫరా చేయడం వల్ల అద్దె ఖర్చులు తగ్గుతాయి. తక్కువ పెట్టుబడితోనే ఈ వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు.

ఒక్క ప్లేట్ టిఫిన్ ధరను 30గా నిర్ణయిస్తే రోజుకు 200 ప్లేట్లు అమ్మగలిగితే రోజువారీ ఆదాయం సుమారు 6000 వరకు ఉంటుంది. నెలవారీగా చూస్తే సుమారు 180000 ఆదాయం వస్తుంది. ముడి సరుకులు, ఇంధనం, ప్యాకింగ్ ఖర్చులు కలిపి నెలకు సుమారు 80000 ఖర్చు అయ్యే అవకాశం ఉంటుంది. ఆ మొత్తాన్ని తీసివేస్తే నెలకు సుమారు 100000 వరకు నికర లాభం పొందవచ్చు. ఏడాదికి ఇది 1200000 వరకు చేరే అవకాశం ఉంటుంది.

రుచి, పరిశుభ్రత, సమయపాలన ఉంటే కస్టమర్లు స్వయంగా పెరుగుతారు. సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడం, ఆఫీసులు, కాలేజీలు, హాస్టళ్ల వద్ద సరఫరా చేయడం ద్వారా వ్యాపారాన్ని మరింత విస్తరించవచ్చు. స్వయం ఉపాధి కోరుకునే యువతకు ఇది మంచి అవకాశంగా మారుతోంది. తక్కువ పెట్టుబడి, స్థిరమైన ఆదాయం కోరుకునే వారికి మొబైల్ టిఫిన్ వ్యాపారం మంచి మార్గంగా నిలుస్తోంది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## ప్రపంచ మతాల దినోత్సవం

ప్రపంచ మతాల దినోత్సవం అనేది కేవలం ఒక క్యాలెండర్‌లో గుర్తించే రోజు మాత్రమే కాదు; అది మానవ సమాజం తనను తాను ప్రశ్నించుకోవాల్సిన సందర్భం. ప్రపంచంలో ఉన్న అనేక మతాలు, ఆచారాలు, సంప్రదాయాలు వేర్వేరుగా కనిపించినా, వాటి మూల తత్వం మాత్రం ఒక్కటే --- మానవత్వం. ప్రేమ, కరుణ, దయ, సత్యం, శాంతి వంటి విలువలను అన్ని మతాలు ఏదో ఒక రూపంలో బోధిస్తాయి. అయినా నేటి సమాజంలో మతం ఐక్యతకు బదులు విభజనకు కారణమవుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ మతాల దినోత్సవం ప్రాధాన్యత మరింత పెరుగుతోంది.

చరిత్రను తిరగేస్తే, మతం మానవ నాగరికత ఎదుగుదలలో కీలక పాత్ర పోషించినట్టు స్పష్టంగా తెలుస్తుంది. సమాజానికి నైతిక విలువలు నేర్పడం, వ్యక్తిలో ఆత్మ నియంత్రణ పెంపొందించడం, సమూహ జీవనానికి నియమాలు ఇవ్వడం వంటి అంశాల్లో మతాల పాత్ర అపారమైనది. అయితే కాలక్రమంలో మతాన్ని శక్తి, ఆధిపత్యం, రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం మొదలైంది. అప్పుడు మతం తన అసలు రూపాన్ని కోల్పోయి, ఘర్షణలకు వేదికగా మారింది. ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేక యుద్ధాలు, అల్లర్లు, హింసాత్మక ఘటనలు దీనికి ఉదాహరణలు.

ప్రపంచ మతాల దినోత్సవం మనకు గుర్తు చేయాల్సిన ప్రధాన విషయం ఏమిటంటే --- మతాల మధ్య తేడాలు సహజం, కానీ ద్వేషం అనవసరం. ప్రతి మతానికి తనదైన విశ్వాసాలు, ఆచారాలు ఉంటాయి. వాటిని గౌరవించడమే నిజమైన సహజీవనం. ఒకరి ప్రార్థనా విధానం వేరుగా ఉందని, వారి ఆహార అలవాట్లు భిన్నంగా ఉన్నాయని, వారి దేవుని భావన మనదానికి సరిపోదని వారిని శత్రువులుగా చూడటం మత బోధనలకు పూర్తిగా విరుద్ధం. నిజమైన మతం ఎప్పుడూ హింసను, అసహనాన్ని సమర్థించదు.

నేటి కాలంలో మతం రాజకీయాలతో కలిసిపోవడం మరో పెద్ద సమస్యగా మారింది. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి, మతాన్ని ఓ ఓటు బ్యాంకుగా మార్చే ప్రయత్నాలు సమాజాన్ని లోపల నుంచే బలహీనపరుస్తున్నాయి. మతాల మధ్య విభేదాలను ప్రోత్సహించడం ద్వారా తాత్కాలిక రాజకీయ లాభాలు సాధించవచ్చేమో కానీ, దీర్ఘకాలంలో అది దేశాల ఏకత్వాన్ని దెబ్బతీస్తుంది. ఒకసారి సమాజంలో అనుమానం, ద్వేషం విత్తనాలు నాటితే, వాటిని తొలగించడం చాలా కష్టం.

భారతదేశం వంటి బహుళ మతాల దేశంలో ఈ అంశం మరింత సున్నితమైనది. ఇక్కడ హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన వంటి అనేక మతాలు శతాబ్దాలుగా కలిసి జీవిస్తున్నాయి. ఈ భిన్నత్వమే భారతదేశ బలంగా నిలిచింది. కానీ అదే భిన్నత్వాన్ని చిచ్చుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు, సమాజం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. మతాల మధ్య ఐక్యతను కాపాడుకోవడం అంటే కేవలం శాంతిని కాపాడుకోవడం మాత్రమే కాదు; దేశ భవిష్యత్తును రక్షించుకోవడం కూడా.

ప్రపంచ మతాల దినోత్సవం యువతకు ఒక ముఖ్యమైన సందేశం ఇస్తుంది. సోషల్ మీడియా యుగంలో అబద్ధాలు, ద్వేషపూరిత ప్రచారం వేగంగా వ్యాపిస్తోంది. మతాల పేరుతో తప్పుడు సమాచారాన్ని నమ్మకుండా, ప్రశ్నించే దృక్పథం యువతలో పెరగాలి. మతాన్ని వ్యక్తిగత ఆధ్యాత్మిక అనుభూతిగా చూడటం, ఇతరుల విశ్వాసాలను గౌరవించడం నేర్చుకున్నప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుంది.

చివరగా, ప్రపంచ మతాల దినోత్సవం మనందరికీ ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది --- మతం మనల్ని విడగొట్టడానికి కాదు, కలపడానికి. దేవుడి పేరు వేరైనా, ప్రార్థన విధానం భిన్నమైనా, మనిషి అనే గుర్తింపు ఒక్కటే. ఆ సత్యాన్ని అంగీకరించిన రోజే మతాల మధ్య నిజమైన ఐక్యత సాధ్యమవుతుంది. శాంతి, సహజీవనం, పరస్పర గౌరవం అనే విలువలను ఆచరణలో పెట్టినప్పుడే ఈ దినోత్సవానికి నిజమైన అర్థం లభిస్తుంది.

## ఆదోని జిల్లా ను సాధించుకుందాం

- 37 వ రిలే దీక్షల్లో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు.








(ఆలూరు మనగళం): విద్యారంగం అభివృద్ధి చెందాలంటే ఆదోనిను జిల్లాగా ప్రకటించాలని సిపిఐ నేత భూపేష్,వైసీపీ ఆర్ టి ఐ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు కొట్టాల రాజు, జెపిసి నాయకులు కత్తి రామాంజనేయులు, ఎల్లప్ప, చంద్రకాంత్ రెడ్డిలు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆలూరు జెపిసి ఆధ్వర్యంలో వేస్తున్న దీక్ష 37వ రోజుకు చేరుకుంది ఈ దీక్షలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు బంటనహాల్ నాగరాజు, రవి శంకర్, రామకృష్ణ రెడ్డి, ఈరన్న, నెమెకల్ నాగరాజు, మౌలేష్, నాగలింగప్ప, మనోహర్, గౌసిద్ధ, సూర్యనారాయణ పాల్గొన్నారు. వీరికి సామాజిక కార్యకర్త కమలాకర్ నాయుడు, ఓం శాంతి సంస్థ సభ్యులు బసి రెడ్డి, కాంగ్రెస్ మండల కార్యదర్శి పూల రామాంజనేయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు తిమ్మప్ప, సంగీవబావం ప్రకటించారు. 5నియోజకవర్గాల ప్రజల ఆకాంక్షను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ఆదోనిను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## లింక్ క్లిక్ చేస్తే 5000 ఖాతాలో పడతాయా..!?



హైదరాబాద్ -- 17 జనవరి -- మనగళం : సంక్రాంతి పండుగను టార్గెట్ చేసుకుని సైబర్ మోసగాళ్లు కొత్త ఎత్తుగడకు పాల్పడుతున్నారు. లింక్ క్లిక్ చేస్తే 5000 రూపాయలు ఖాతాలో పడతాయని చెబుతూ సామాజిక మాధ్యమాల్లో సందేశాలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మొదట నమ్మలేదని, కానీ నిజంగానే డబ్బులు వచ్చాయని చెప్పేలా ఆకర్షణీయమైన సందేశాలు ఉండటంతో చాలామంది మోసపోయే ప్రమాదం ఉందని సైబర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ తరహా సందేశాలు పూర్తిగా నకిలీవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పండుగ ఆఫర్ల పేరుతో వచ్చే లింక్‌ను ఓపెన్ చేస్తే మొబైల్‌లోకి హానికరమైన సాఫ్ట్‌వేర్ ప్రవేశించి, ఫోన్‌లో ఉన్న ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారం దొంగల చేతికి వెళ్లే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. ఒక్కసారి సమాచారం లీక్ అయితే క్షణాల్లో ఖాతాలోని డబ్బు ఖాళీ అవుతుందని హెచ్చరిస్తున్నారు. ఉచితంగా డబ్బులు ఇస్తామనే సందేశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూచిస్తున్నారు. డిజిటల్ చెల్లింపుల యాప్‌ల ఎప్పటికీ లింక్‌ల ద్వారా డబ్బులు ఆఫర్ చేయవని పోలీసులు గుర్తు చేస్తున్నారు. స్నేహితులు ఫార్వార్డ్ చేసిన సందేశమైనా సరే నిజమని భావించకుండా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఇలాంటి లింక్‌లను వెంటనే తొలగించాలని, క్లిక్ చేయకూడదని హెచ్చరిస్తున్నారు. ఎవరైనా పొరపాటున ఈ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. సమయానికి సమాచారం అందిస్తే నష్టాన్ని కొంతవరకు ఆపే అవకాశం ఉంటుందని తెలిపారు. పండుగ వేళ మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ క్రీడాకారులను అభినందిస్తున్న శ్రీశైలం డ్యాం ఎస్పీఎఫ్ ఆర్ ఐ.రాజేష్

మనగలం :సున్నిపెంట : గత రెండు రోజులుగా కొనసాగుతుంది. ఈ టోర్నమెంట్కు ముఖ్య అతిథులుగా ఎల్లారెడ్డి, సున్నిపెంట రెండో పట్టణ సీఐ జి.సుబ్బారావు, ఎస్పీఎఫ్ ఆర్ రాజేష్, తెదేపా నాయకులు ఉమామహేశ్వరరావు, జనసేన నాయకులు నాగ సాయిరాం, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు కాకా, ప్రసాద్, సుమన్ టీవీ చందు, రిపోర్టర్ విజయ్,హాజరై రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్కు అనంతపురం టీమ్, అనంతపురం పోలీసు టీమ్, ములుగు టీమ్, వైజాగ్ టీమ్, అనకాపల్లి టీమ్, శ్రీకాకుళం టీమ్, మహబూబ్ నగర్ పోలీస్ టీమ్, మహబూబ్ నగర్ హాస్టల్ టీమ్, అచ్చంపేట టీమ్, సర్వీస్ టీమ్, మంగళూరుటీమ్, సన్ రైజ్ టీమ్ లు తలపడ్డాయి సన్ రైజ్ కమిటీ నిర్వాహకులు శ్రీను, రాయల్ రమేష్, ఇన్నాడ్, బాబు, ఖలీల్, సల్మాన్,తెలిపారు.



## ఆధార్ ఫొటో మార్చాలనుకుంటున్నారా..? ఆన్‌లైన్‌లో కుదరదా..!

హైదరాబాద్ -- 17 జనవరి -- మనగళం : ఆధార్ కార్డు దేశంలో ప్రతి పౌరుడికి అత్యంత కీలకమైన గుర్తింపు పత్రం. ప్రభుత్వ సేవలు పొందాలన్నా, సిమ్ కార్డు తీసుకోవాలన్నా, బ్యాంకు పనులు చేయాలన్నా ఆధార్ తప్పనిసరి. అందుకే ఆధార్‌లో ఉన్న వివరాలు సరిగ్గా ఉండేలా చూసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా చిన్న వయస్సులో తీసిన ఫొటో పెద్దయ్యాక గుర్తుపట్టడం కష్టంగా మారుతుంది. దీనివల్ల ధృవీకరణ సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది.




ప్రస్తుతం ఆధార్ కార్డుల్లో ఫొటోను ఆన్‌లైన్‌లో మార్చుకునే సదుపాయం లేదు. ఫొటో మార్పు కోసం తప్పనిసరిగా ఆధార్ నమోదు కేంద్రం లేదా ప్రభుత్వ సేవా కేంద్రానికి వెళ్లాలి. అక్కడ ఫొటో మార్పు కోసం దరఖాస్తు పత్రం నింపాలి. జీవమాన గుర్తింపు వివరాలు నమోదు చేయించిన తర్వాత అక్కడే కొత్త ఫొటో తీస్తారు.

ఫొటో మార్పు కోసం ముందుగా అధికారిక జాలస్థలంలో నుంచి దరఖాస్తు పత్రాన్ని పొందాలి. వివరాలు పూర్తిగా నింపి సమీపంలోని ఆధార్ కేంద్రానికి వెళ్లాలి. అక్కడ 100 రుసుము చెల్లించాలి. అనంతరం జీవమాన గుర్తింపు తనిఖీ చేసి ఫొటో తీస్తారు. ఫొటో తీసిన తర్వాత ఎలా వచ్చిందో ఒకసారి పరిశీలించుకోవచ్చు.

ఫొటో నమోదు పూర్తైన తర్వాత ఒక అభ్యర్థన సంఖ్య అందుతుంది. ఆ సంఖ్య ఆధారంగా ఫొటో మార్పు స్థితిని తెలుసుకోవచ్చు. మార్పు పూర్తయిన తర్వాత కొత్త ఆధార్ కార్డు కోసం అభ్యర్థన పెట్టుకోవచ్చు. కొద్ది రోజుల్లో పోస్టు ద్వారా కొత్త ఆధార్ కార్డు ఇంటికి చేరుతుంది.

ఫొటో సరిగ్గా ఉండడం వల్ల గుర్తింపు ప్రక్రియ వేగంగా పూర్తవుతుంది. భవిష్యత్తులో ఎలాంటి ధృవీకరణ సమస్యలు రాకుండా ఉండేందుకు అవసరమైతే ఆధార్ ఫొటోను తప్పకుండా నవీకరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.


## తుమ్మలచెరువు షాది ఖానా నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన డాక్టర్ షేక్ మహబూబ్ వలి

మన గళం : మార్కాపురం జిల్లా, తర్లుపాడు మండలం తుమ్మలచెరువు గ్రామంలో షాది ఖానా నిర్మాణం దశాబ్దకాలంగా పూర్తికాకపోవడంపై ఉమ్మడి జిల్లా మైనారిటీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు 17-06-2026న తుమ్మలచెరువులో స్థానికులతో కలిసి పరిశీలన చేపట్టారు.

తర్లుపాడు మండలంలో అత్యధిక మైనారిటీ ముస్లిం సోదరులు నివసిస్తున్న గ్రామంగా తుమ్మలచెరువు గుర్తింపు పొందింది. ఇక్కడి ప్రజలు ప్రధానంగా రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే, గ్రామంలో నిర్మాణంలో ఉన్న షాది ఖానా పనులు పదేళ్లకు పైగా పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వాలు మారుతున్నా షాది ఖానా నిర్మాణం మాత్రం 'ఎక్కడ వేసిన గొంగలి అక్కడే' అన్నట్టుగా ఉండిపోయిందని డాక్టర్ షేక్ మహబూబ్ వలి విమర్శించారు. ప్రస్తుతం షాది ఖానా ఆవరణ ముల్లకంపలు, చెత్తాచెదారంతో నిండిపోయి ఉందని తెలిపారు. మైనారిటీలకు అండగా ఉన్నామని చెప్పే ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా వెంటనే షాది ఖానా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ షేక్ మహబూబ్ వలి తర్లుపాడు మండల డిప్యూటీ ఎంపీపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు.



ఈ కార్యక్రమంలో తర్లుపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, తుమ్మలచెరువు గ్రామ పెద్దలు సయ్యద్ అమీర్, సయ్యద్ గౌస్, షేక్ షఫీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు షేక్ అబ్దుల్, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామవాసులు పాల్గొన్నారు.

## గుమ్మకొండ గ్రామ ఆంజనేయ స్వామికి మౌని అమావాస్య కు ప్రత్యేక పూజలు

మన గళండోన్ శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే శ్రీరామ జయ రామ జయ జయ రామ భక్తజనులకు విజ్ఞప్తి... దర్శించండి తరించండి... యక్షులు ప్రతినిత్యం స్వామి వారిని పూజిస్తూ ప్రత్యక్షంగా తపమాచరిస్తున్న మహోన్నతమైన, ఎంతో మహిమాన్వితమైన క్షేత్రం.. సంతాన వరదుడు, కోరికలు తీర్చుకొంగు బంగారం, సమస్త రోగ ప్రసమానార్థం, ఆయురారోగ్య ఐశ్వర్య అభివృద్ధి దాత, భూతప్పేతాధికముల నుండి విముక్తి కలిగించే అసాధ్యసాధక, అంజనీపుత్ర పవనసుత నామ, రామభక్త శివ స్వరూప, శ్రీశ్రీశ్రీ బంగారుకొండ పాత పాలెం అభయాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు.. శ్రీ విశ్వ వాసు నామ సంవత్సరం, ఉత్తరాయణం , హేమంత రుతువు , పుష్య మాసం ,కృష్ణ పక్షం, , 18-01-2026, పుష్య అమావాస్య (ఆదివారం అమావాస్య) సందర్భంగా స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించబడును అని ఆలయ ధర్మకర్త బొమ్మిరెడ్డి దశరథ రామ్ రెడ్డి తెలిపారు. కనుక నంద్యాల జిల్లాడోన్ మండలం గుమ్మకొండ గ్రామం కొండలలో వెలసిన వ్యాసరాయ ప్రతిష్టా మూర్తి శ్రీశ్రీశ్రీ బంగారుకొండ పాతపాలెం అభయాంజనేయ స్వామి వారికి పుష్య అమావాస్య (ఆదివారం అమావాస్య) సందర్భంగా, 18-01-2026, న ప్రాతఃకాల పూజలు ఉదయం 5 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకాలు, తమలపాకు తోరణాభిషేకాలు, సింధూర కుంకుమార్చనలు, నైవేద్య సమర్పణ, తీర్థ ప్రసాద వినియోగం జరుగును.. తదుపరి మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి మహా నైవేద్య సమర్పణ , మహా మంగళహారతి సమర్పణ కార్యక్రమాలు జరుగును. తదుపరి అన్నసంతర్పణ కార్యక్రమం కలదు.. కావున భక్తులందరూ స్వామి వారిని దర్శనం చేసుకుని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ ధర్మకర్త పూజారి తెలిపారు.



# జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేయాలి

– ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

మనగళం, ఎమ్మిగనూరు : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, ఆ స్థానంలో తీసుకొచ్చిన జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేయాలి రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, పట్టణ కార్యదర్శి గోవిందు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం ఎమ్మిగనూరు ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యులు, సానుభూతి పరుల విస్తృత సమావేశం సుందరయ్య భవన్ లో రాముడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో వి బి జీరాంజీ బిల్లును పార్లమెంటులో ఆమోదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టం వల్ల గ్రామీణ పేద ప్రజలు ఒక్క పూటైనా తిండి తింటున్నారని తెలిపారు. అటువంటి చట్టాన్ని మార్చి జీరామ్ జీ బిల్లును తీసుకురావడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. 125 రోజులు పని కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం అవాస్తవాలు చెబుతున్నదన్నారు. ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని, ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని వారు




పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హనుమంతు, లక్ష్మీ నరసయ్య, రమేష్, సురేష్, సుభాన్, రాఘవరెడ్డి, అబ్దుల్లా, గోరె భాష, ఇస్మాయిల్, తిమ్మన్న, రాజా రమేష్, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైల దేవస్థానమునకు వెండి వస్తువుల విరాళం





మనగళం శ్రీశైలం : ఈ రోజు (17.01.2026) శ్రీ యం. జ్యోతిర్మయి, హైదరాబాద్ వారు ఒక వెండి పళ్ళెం, రెండు వెండి గిన్నెలు మరియు ఒక వెండి దీపం దేవస్థానమునకు విరాళంగా సమర్పించారు. ఈ వెండి వస్తువుల బరువు 630 గ్రాములు అమ్మవారి ఆలయప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు వీటిని పర్యవేక్షకులు గంజి రవి, అమ్మవారి ఆలయం ఇన్స్పెక్టర్ కె. మల్లికార్జున, జూనియర్ అసిస్టెంట్ ఎం.సావిత్రికి అందజేశారు. అనంతరం వీరికి తగు రశీదును అందజేసి వేదాశీర్వచనముతో శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేయడం జరిగింది.

# యూపీఐకి షాక్ సిద్ధం..! ఇకపై లావాదేవీలకు ఛార్జీలేనా..?

న్యూఢిల్లీ -- 17 జనవరి -- మనగళం: దేశవ్యాప్తంగా యూపీఐ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. రోడ్డు పక్కన చిన్న దుకాణాల నుంచి పెద్ద షాపింగ్ కేంద్రాల వరకు ప్రతిచోటా నగదు లేకుండానే చెల్లింపులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు యూపీఐ ద్వారా లావాదేవీలు పూర్తిగా ఉచితంగా సాగుతున్నప్పటికీ భవిష్యత్తులో ఛార్జీలు విధించే అవకాశం ఉందనే సంకేతాలు వెలువడుతున్నాయి.

యూపీఐ సేవలను నిర్వహించేందుకు భారీ ఖర్చులు అవుతున్నాయని ఫిన్ టెక్ సంస్థలు చెబుతున్నాయి. సాంకేతిక మౌలిక సదుపాయాలు, సర్వర్ల నిర్వహణ, భద్రతా వ్యవస్థలు, మోసాల నివారణ, వినియోగదారుల సేవల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయని వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు తగ్గడంతో ఈ భారాన్ని భరించడం కష్టమవుతోందని ఫోన్ పే, గూగుల్ పే వంటి సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## సంక్రాంతి బ్రహ్మోత్సవాలు - పూర్ణాహుతి






మనగళం శ్రీశైలం : మకరసంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని పంచాహ్నికదీక్షతో ఏడురోజులపాటు నిర్వహింపబడే సంక్రాంతిబ్రహ్మోత్సవాలలో ఆరవరోజైన ఈ రోజు (17.01.2026) శ్రీ స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించబడ్డాయి. తరువాత శ్రీస్వామివారి యాగశాలలో శ్రీచండీశ్వరస్వామివారికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహదాశీర్వచనం జరిపించబడ్డాయి.

పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధద్రవ్యాలు, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించి యాగపూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగింది. అనంతరం వసంతోత్సవం జరిపించబడింది. అనంతరం జరిగిన వసంతోత్సవంలో ఆలయ అర్చకులు, వేదపండితులు వసంతాన్ని (పసుపు, సున్నం కలిపిన మంత్ర పూరిత జలం) సమంత్రకంగా భక్తులపై ప్రోక్షించారు.

తరువాత జరిగిన అవబృథస్నానంలో చండీశ్వరస్వామికి ఆలయపుష్కరిణి వద్ద ఆగమ శాస్త్రోక్తంగా స్నపన కార్యక్రమం నిర్వహించబడింది. చివరగా త్రిశూలస్నాన కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం. శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు దేవకి వెంకటేశ్వర్లు, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీ ఎ. శ్రీనివాసులు, ప్రధానార్చకులు స్థానాచార్యులు (అధ్యాపక) వేదపండితులు, అర్చకస్వాములు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సదస్యం నాగవల్లి సంక్రాంతి బ్రహ్మోత్సవాలలో భాగంగానే ఈ రోజు (17.01.2026 ) సాయంత్రం స్వామిఅమ్మవార్ల నిత్యకల్యాణమండపంలో సదస్యం మరియు నాగవల్లి కార్యక్రమాలు జరిపించబడుతాయి. సదస్యం కార్యక్రమంలో వేదపండితులచే వేదస్వస్తి, నిర్వహించబడుతుంది. నాగవల్లి కార్యక్రమంలో సంక్రాంతి పర్వదినాన కల్యాణోత్సవం జరిపించబడిన అమ్మవారికి ఆగమశాస్త్రం సంప్రదాయం మేరకు మెట్టెలు, నల్లపూసలు సమర్పించబడుతాయి.


ధ్వజావరోహణ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ రోజు (17.01.2026) సాయంకాలం ధ్వజావరోహణ కార్యక్రమం జరిపించబడుతుంది. ఈ ధ్వజావరోహణ కార్యక్రమంలో ఉత్సవాల మొదటిరోజున బ్రహ్మోత్సవ ప్రారంభ సూచకంగా ఆలయధ్వజస్తంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజపటం అవరోహణ చేయబడుతుంది. రేపటితో ముగియనున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాలు రేపు (18.01.2025) సాయంకాలం శ్రీ స్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ మరియు ఆలయ ఉత్సవం జరిపించబడుతుంది. ఆలయ ఉత్సవం అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, ఏకాంతసేవ, శయనోత్సవం జరిపించబడుతాయి.

## శ్రీశైల గో సంరక్షణ పథకానికి విరాళం

మనగళం శ్రీశైలం : శ్రీ ఎస్. పాపారావు, హైదరాబాద్ వారు ఈ రోజు ( 17.01.2026) గో సంరక్షణ పథకానికి విరాళం రూ. 1,00,000/-లను అందజేశారు. ఈ మొత్తాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి సి. హెచ్. శ్రీనివాసరెడ్డికి అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.



# విన్నీ ది పూ దినోత్సవం



- బాల్యపు కల్పనలకు చిరునామా - స్నేహానికి, సరళ జీవనానికి ప్రతీక
- పిల్లల సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన పాత్ర



డెస్క్, జనవరి 17 , మనగళం: విన్నీ ది పూ దినోత్సవం అనేది కేవలం ఒక బాలల కథా పాత్రను స్మరించుకునే రోజు మాత్రమే కాదు; అది బాల్యపు స్వచ్ఛతను, ఊహాశక్తిని, సరళమైన జీవన తత్వాన్ని గుర్తు చేసే ప్రత్యేక సందర్భం. ప్రసిద్ధ బాల సాహిత్య రచయిత ఏ.ఏ. మిల్న్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ దినాన్ని పాటిస్తారు. ఆయన సృష్టించిన విన్నీ ది పూ పాత్ర ప్రపంచవ్యాప్తంగా కోట్లాది పిల్లలకే కాకుండా పెద్దల మనసులకూ చేరువైంది. కాలం మారినా, తరాలు మారినా ఈ పాత్రపై ఉన్న ప్రేమ మాత్రం తగ్గలేదు.

విన్నీ ది పూ కథలు పిల్లల ప్రపంచాన్ని ఒక ప్రత్యేకమైన కలల లోకంలోకి తీసుకెళ్తాయి. అడవిలో నివసించే ఒక చిన్న ఎలుగుబంటి, అతని స్నేహితులు, వారి మధ్య జరిగే సాధారణ సంఘటనలే ఈ కథల సారాంశం. కానీ ఆ సాధారణతలోనే ఒక లోతైన జీవన తత్వం దాగి ఉంటుంది. ఎక్కువ ఆశలు లేకుండా, ఉన్నదానిలో సంతోషం వెతుక్కోవడం, స్నేహాన్ని విలువగా భావించడం, చిన్న విషయాల్లో ఆనందాన్ని చూడటం --- ఇవన్నీ విన్నీ ది పూ కథలు పిల్లలకు సహజంగా నేర్పిస్తాయి.

పిల్లల సాహిత్యంలో విన్నీ ది పూ ప్రత్యేకంగా నిలవడానికి కారణం, ఈ కథలు కేవలం వినోదానికే పరిమితం కాకపోవడమే. అవి పిల్లల మానసిక వికాసానికి కూడా దోహదపడతాయి. స్నేహం అంటే ఏమిటి, ఒంటరితనాన్ని ఎలా ఎదుర్కోవాలి, భయం వచ్చినప్పుడు ఎలా ధైర్యంగా ఉండాలి వంటి అంశాలు కథల రూపంలో సున్నితంగా పిల్లల మనసుల్లో నాటబడతాయి. అందుకే ఈ కథలు చదివిన పిల్లలు తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మరింత సానుకూలంగా చూడగలుగుతారు.

విన్నీ ది పూ పాత్ర పెద్దలకు కూడా ఒక పాఠాన్ని నేర్పిస్తుంది. ఆధునిక జీవితంలో ఒత్తిడి, పోటీ, పరుగులు పెరిగిన వేళ, ఈ చిన్న పాత్ర మనల్ని ఆగి ఆలోచించమని చెబుతుంది. జీవితం అంటే ఎప్పుడూ పెద్ద విజయాలే కాదు; ఒక స్నేహితుడితో మాట్లాడటం, ప్రకృతిని ఆస్వాదించడం, మనసుకు నచ్చిన చిన్న ఆనందాలను స్వీకరించడం కూడా జీవన సౌందర్యంలో భాగమేనని గుర్తు చేస్తుంది. అందుకే విన్నీ ది పూ కథలు పిల్లలకే కాదు, పెద్దలకూ ఆదరణ పొందుతున్నాయి.

డిజిటల్ యుగంలో పిల్లలు తెరలకే పరిమితమవుతున్న ఈ కాలంలో, విన్నీ ది పూ వంటి బాల సాహిత్య రచనలు మరింత అవసరంగా మారాయి. ఇవి పిల్లలను పుస్తకాల వైపు ఆకర్షిస్తాయి, వారి ఊహాశక్తిని విస్తరింపజేస్తాయి. కథలు చదవడం ద్వారా భాషా నైపుణ్యాలు పెరుగుతాయి, భావోద్వేగాలను అర్థం చేసుకునే శక్తి మెరుగుపడుతుంది. ఈ దృష్ట్యా విన్నీ ది పూ దినోత్సవం పిల్లల పుస్తకాల ప్రాముఖ్యతను కూడా గుర్తు చేసే రోజు.

మొత్తంగా విన్నీ ది పూ దినోత్సవం బాల్యపు అమాయకత్వాన్ని, స్నేహపు విలువను, సరళ జీవన సౌందర్యాన్ని గుర్తు చేసే ప్రత్యేక రోజు. పిల్లల ప్రపంచాన్ని వెలిగించిన ఈ పాత్ర, పెద్దల జీవితాలకు కూడా ఒక సాంత్వనగా నిలుస్తోంది. కల్పనకు, మానవ సంబంధాలకు ఎంత ప్రాముఖ్యత ఉందో చెప్పే విన్నీ ది పూ కథలు, రాబోయే తరాలకూ అలాగే కొనసాగుతాయనే విషయంలో ఎలాంటి సందేహం లేదు.

## ఈ నెల 19 నుండి 31 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు.

- ఆలూరు పశు సంవర్ధక శాఖ అధికారి డా , టి.ధనుంజయుడు.



( ఆలూరు మనగళం ): ఈ నెల 19 నుండి 31 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆలూరు సహాయ సంచాలకులు డా.టీ.ధనుంజయుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలూరు ప్రాంతీయ పశు వైద్య శాల పరిధిలో భాగంగా ఆలూరు మండలం మరియు చిప్పగిరి మండలం గ్రామాలలో ఉన్న పాడి రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇందులో భాగంగా పాడి పశువులకు దూడలకు, గొర్రెలకు మేకలకు నట్టల నివారణ మందులు వేస్తారు. అలాగే గొర్రెలకు బొబ్బ రోగం రాకుండా టీకాలు వేయడం జరుగుతుందని, మరియు కోళ్లకు కొక్కెర తెగులు రాకుండా టీకాలు వేస్తామని పశువులకు గొర్రెలకు భీమా పథకం ఏర్పాటు చేస్తామని ఆలూరు సహాయ సంచాలకులు పశు సంవర్ధక శాఖ వారు తెలియజేశారు.

## ప్రపంచకప్‌పై గురి పెట్టిన జింబాబ్వే.. దిగ్గజ పేసర్‌కు కీలక బాధ్యతలు..!

హరారే -- జనవరి 17 -- మనగళం: ఒకప్పుడు బుల్లెట్ వేగంతో బ్యాటర్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన దిగ్గజ పేసర్ కోర్ట్నీ వాల్ష్ ఇప్పుడు కోచ్‌గా మరోసారి సంచలనం సృష్టించేందుకు సిద్ధమయ్యాడు. వెస్టిండీస్ తొలి తరం క్రికెటర్లలో ఒకడైన వాల్ష్‌ను జింబాబ్వే క్రికెట్ బోర్డు బౌలింగ్ కన్సల్టెంట్‌గా నియమించింది. రాబోయే ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకొని బౌలింగ్ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ కీలక నిర్ణయం తీసుకుంది. గత సీజన్‌లో అర్హత సాధించలేకపోయిన జింబాబ్వే ఈసారి అద్భుత ఆటతో ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. సికిందర్ రజా నాయకత్వంలో జట్టు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోంది. పెద్ద జట్లకు షాక్ ఇవ్వాలనే లక్ష్యంతో అనుభవజ్ఞులైన కోచ్‌లను జట్టులోకి తీసుకుంటోంది. ఈ క్రమంలోనే పేస్ దిగ్గజం వాల్ష్‌కు బాధ్యతలు అప్పగించింది.

## పాక్ మందులకు చెక్ పెట్టిన ఆఫ్ఘన్ ప్రభుత్వం..



కాబూల్ -- జనవరి 17 -- మనగళం: పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ ఆఫ్ఘన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్తాన్ నుంచి దిగుమతి అవుతున్న ఔషధాలపై నిషేధం విధించి భారత్ నుంచి మందులు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇటీవల రెండు దేశాల మధ్య సైనిక ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంతో వాణిజ్య సంబంధాలపై కూడా ప్రభావం పడింది.

ఇటీవల కాబూల్‌లో ఓ వ్యక్తి పారాసిటమాల్ మందులు కొనుగోలు చేయగా ఫార్మసిస్ట్ పాకిస్తాన్ మందులకంటే భారత్ నుంచి వచ్చిన టాబ్లెట్లు నాలుగు రెట్లు చౌకగా ఉంటాయని సూచించారు. నాణ్యత కూడా మెరుగ్గా ఉంటుందని తెలిపారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీసింది.

పాకిస్తాన్ నుంచి వచ్చే మందుల నాణ్యతపై ఇప్పటికే ఆఫ్ఘన్ ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చింది. ఉప ప్రధాన మంత్రి అబ్దుల్ ఘనీ బరదార్ పలుమార్లు ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ వ్యాపారులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతకాలని సూచించారు. ఆ నేపథ్యంలో భారతీయ ఔషధాలు ఆఫ్ఘన్ మార్కెట్‌ను ఆకర్షించాయి.

భారత్ ఇప్పటికే కాబూల్‌కు భారీ స్థాయిలో ఔషధ సహాయం అందిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి ఆఫ్ఘనిస్తాన్‌కు కోట్ల విలువైన మందులు పంపించారు. తక్కువ ధరలు మెరుగైన నాణ్యత ఉండటంతో ప్రజల్లోనూ భారతీయ మందులపై విశ్వాసం పెరిగింది.

ఈ నిర్ణయంతో పాకిస్తాన్ ఔషధ వ్యాపారానికి పెద్ద దెబ్బ తగలనున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు భారత్‌కు ఇది కొత్త వాణిజ్య అవకాశంగా మారనుంది. ఆరోగ్య రంగంలో భారత్ ప్రభావం మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

## మళ్లీ తగ్గిన బంగారం ధరలు..



హైదరాబాద్ -- జనవరి 17 -- మనగళం: బంగారం వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి మరోసారి ఊరట లభించింది. కిందటి రోజుతో పోలిస్తే దేశీయంగా ధరలు తగ్గుముఖం పట్టాయి. వరుసగా రెండో రోజు బంగారం ధరలు పడిపోవడంతో వినియోగదారులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో కూడా ధరలు స్వల్పంగా తగ్గడం దీనికి ప్రధాన కారణంగా నిపుణులు చెబుతున్నారు.

భారతీయులకు బంగారం అంటే ప్రత్యేకమైన అభిమానం ఉంటుంది. ముఖ్యంగా పండుగలు వివాహాల సమయంలో బంగారానికి భారీ డిమాండ్ ఉంటుంది. అలంకరణతో పాటు పెట్టుబడిగా కూడా బంగారాన్ని ప్రజలు భావిస్తారు. ఇటీవల అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల వల్ల బంగారం ధరలు భారీగా పెరిగాయి. అయితే ఇప్పుడు ఆ గరిష్ఠ స్థాయిల నుంచి ధరలు క్రమంగా తగ్గుతున్నాయి.

హైదరాబాద్ మార్కెట్‌ను పరిశీలిస్తే ఇవాళ 22 క్యారెట్ల బంగారం ధర తులానికి 200 తగ్గి 131450కి చేరింది. కిందటి రోజు కూడా ఈ ధర 350 తగ్గడం గమనార్హం. అలాగే 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర 10 గ్రాములకు 220 తగ్గి 143400 వద్ద ట్రేడవుతోంది. ముందు రోజు ఈ ధర 380 తగ్గింది. బంగారం బాటలోనే వెండి ధరలు కూడా తగ్గాయి. ఇవాళ కేజీ వెండి ధర 4000 తగ్గి హైదరాబాద్‌లో 306000 వద్ద కొనసాగుతోంది. అయితే గత కొన్ని రోజులుగా వెండి ధరలు భారీగా పెరగడం వినియోగదారులను ఆందోళనకు గురి చేసింది. కేవలం ఆరు రోజుల్లోనే దాదాపు 42000 వరకు పెరగడం గమనార్హం.అంతర్జాతీయంగా ధరలు తగ్గడం, పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వల్ల రాబోయే రోజుల్లో కూడా ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కొనుగోలు చేయాలనుకునే వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకునే వీలుందని వ్యాపారులు సూచిస్తున్నారు.

# ట్రేడ్ బకాయిలపై 'కొరడా'

**– షరాఫ్ బజార్‌లోని 196 దుకాణాలకు క్లోజర్ నోటీసులు**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరపాలక సంస్థకు రావాల్సిన ట్రేడ్ లైసెన్స్ బకాయిల వసూళ్లను నగరపాలక సిబ్బంది వేగవంతం చేశారు. బకాయిలు చెల్లించని వ్యాపారులపై సిబ్బంది కఠిన చర్యలు చేపడుతున్నారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించని దుకాణదారులపై నిబంధనల ప్రకారం చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ మేరకు శనివారం షరాఫ్ బజార్ పరిధిలో సుమారు రూ.15 లక్షల ట్రేడ్ లైసెన్స్ బకాయిలు చెల్లించని 196 దుకాణాలకు క్లోజర్ నోటీసులు జారీ చేశారు. అలాగే క్లోజర్ నోటీసులు జారీ చేసినప్పటికీ బకాయిలు చెల్లించకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్న మూడు షాపులను సీజ్ చేశారు. మున్సిపల్ నిబంధనలను అతిక్రమిస్తూ వ్యాపారాలు నిర్వహించడం చట్ట విరుద్ధమని, బకాయిలు చెల్లించని పక్షంలో మరింత కఠిన చర్యలు తప్పవని ప్రజారోగ్య సిబ్బంది హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్ బకాయిలు చెల్లించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని పేర్కొంటూ, వెంటనే బకాయిలు చెల్లించి సహకరించాలని నగరపాలక సిబ్బంది వ్యాపారులను కోరారు. నగర అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణతో పాటు ప్రజా సౌకర్యాల నిర్వహణకు ఈ వసూళ్లు ఎంతో కీలకమని వివరించారు. ఈ తనిఖీల్లో శానిటేషన్ ఇంస్పెక్టర్ రమేష్ బాబు, ఆర్.రాజు, మునిస్వామి, అనిల్ కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారు



మనగళం, కర్నూలు సిటీ : సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని, సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకున్నారని కుడా చైర్మన్, తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్ల ఆర్థిక నేరగాడైనటువంటి జగన్ రెడ్డి పాలనలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని, ఏ పండుగనూ సంతోషంగా జరుపుకోలేదన్నారు. విశ్వాసం లేని నాయకుడు వైఎస్ జగన్ అని, తండ్రి మరణాన్ని సైతం స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నారని విమర్శించారు. కేవలం పదవి కోసం ఎంతకైనా దిగజారే తత్వం జగన్ రెడ్డిదని ధ్వజమెత్తారు. తల్లి, చెల్లిని సైతం ఇంటి నుంచి గెంటేసిన జగన్ రెడ్డి నైజం స్వార్థానికి ప్రత్యక్ష సాక్ష్యం అని విమర్శించారు. జగన్ రెడ్డి నైజాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రజలు గత సార్వత్రిక ఎన్నికల్లో కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా చిత్తుగా ఓడించా రని, అయినా తన వైఖరిని కొనసాగిస్తూనే ఉన్నారని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, పీఎం నరేంద్ర మోడీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ కలయికతో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తుందని, లోటు బడ్జెట్లో ఉన్నా అధిగమిస్తూ అన్ని రంగాలలో ముందుకుపోతున్నారని కొనియాడారు. కూటమి సర్కార్ కు ప్రజల మద్దతును ఓర్వలేక జగన్ రెడ్డితోపాటు వైసీపీ నేతలు విషం కక్కుతున్నారని, ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారన్నారు. వైసీపీ ఇలానే వ్యవహరిస్తే ప్రజల తిరుగుబాటు తప్పదని ఈ సందర్భంగా సోమిశెట్టి హెచ్చరించారు.

---

# పదిరోజుల క్రితం మరణశయ్యపై.. ఇప్పుడు బీచ్‌లో ఆనందంగా క్రికెట్ దిగ్గజం..!

మెల్‌బోర్న్ -- జనవరి 17 -- మనగళం, : ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామియన్ మార్టిన్ కొత్త సంవత్సరాన్ని కొత్త ఉత్సాహంతో ప్రారంభించాడు. ప్రాణాంతక వ్యాధితో చావు అంచుల వరకు వెళ్లి వచ్చిన మార్టిన్ ఇప్పుడు బీచ్‌లో సేదతీరుతూ జీవితాన్ని ఆస్వాదిస్తున్నాడు. పది రోజుల క్రితం వరకు కోమాలో ఉన్న అతడు తాజాగా సముద్ర తీరంలో దిగిన ఫోటోను పంచుకొని తన కోలుకోవడంపై ఆనందం వ్యక్తం చేశాడు. తన ఆరోగ్యం కోసం ప్రార్థించిన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశాడు. గత డిసెంబర్ 26న తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన మార్టిన్‌కు మెదడుకు సంబంధించిన సంక్రమణ తీవ్రమైంది. వైద్యులు మొదట అతడు బతికే అవకాశాలు చాలా తక్కువ అని భావించారు. దాదాపు 8 రోజులు కోమాలో ఉన్న మార్టిన్ అనూహ్యంగా కోలుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. జనవరి 8న ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన అతడు ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటూ క్రమంగా ఆరోగ్యాన్ని తిరిగి సంపాదించాడు. ఇప్పుడు బీచ్‌లో నడుస్తూ సముద్రపు గాలిని ఆస్వాదించడం తనకు కొత్త జీవితం లభించినట్టుగా అనిపిస్తోందని భావోద్వేగంగా తెలిపాడు.

# దేవాలయాల భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి





**– నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్**

మనగళం, నంద్యాల : దేవాలయాలకు చెందిన భూములు ఎలాంటి అక్రమాలకు గురికాకుండా సత్వర చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో దేవాలయ భూముల పరిరక్షణ అంశంపై జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ల్యాండ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, బనగానపల్లె, డోన్ ఆర్డీఓ నరసింహులు, ఆత్మకూరు ఆర్డీఓ శివనాగజ్యోతి, దేవాదాయ శాఖ అధికారి మోహన్ తదితర అధికారులతో దేవాదాయ భూముల సమస్యలపై చర్చించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ దేవాలయ భూముల పరిరక్షణ బాధ్యత సంబంధిత కార్యనిర్వహణాధికారులపై ఉందన్నారు. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో దేవాదాయ శాఖ సిబ్బంది తప్పనిసరిగా పాల్గొని పేర్లు సక్రమంగా నమోదు చేయించుకోవాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా దేవాలయ భూములు ఆక్రమణకు గురైనట్లయితే వెంటనే వాటిని గుర్తించి, తదుపరి సమావేశంలో చర్చించి ఆక్రమణదారులను తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాదాయ శాఖకు సంబంధించిన భూముల పేర్లను ఆన్లైన్‌లో మ్యూటేషన్ చేయించే విధంగా సంబంధిత మండల తహసీల్దార్లకు సూచనలు జారీ చేయాలని ఆర్డీఓలను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

# సాల్మన్ హత్యకు కూటమి ప్రభుత్వ వైఖరే కారణం






మనగళం, కర్నూలు సిటీ : పల్నాడు జిల్లా పిన్నెల్లిలో వైసీపీ కార్యకర్త మండా సాల్మన్ హత్యకు కూటమి ప్రభుత్వ వైఖరే కారణం అని వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. ఈ ఘటనను ఖండిస్తూ శనివారం కర్నూలు పాత బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ శ్రేణులు నిరసన తెలిపారు. కూటమి సర్కార్ కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి సర్కార్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుందని విమర్శించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ శ్రేణులుపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, దాడులు, బెదరింపులకు పాల్పడుతున్నారన్నారు. అప్పటికీ లొంగకపోతే హత్యలకు సైతం తెగడుతున్నారని, ఫలితం చవిచూస్తారని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ ఇప్పటికైనా హత్యా రాజకీయాలకు కూటమి పెద్దలు స్వస్తి చెప్పాలని, లేని పక్షంలో ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సాల్మన్ హత్య బాధ్యులను వెంటనే గుర్తించి చట్టబద్ధంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కల్లూరులో వైఎసీపీ శ్రేణులు నిరసన : పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త మందాసల్మాన్ హత్యను ఖండిస్తూ ఆ పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ 33వ వార్డు కార్పొరేటర్ మైతాపు నరసింహులు, కర్నూలు యాక్టివిటీ సెక్రటరీ పాలకొలను రమేష్ ఆధ్వర్యంలో కల్లూరులో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు సంగాల సుదర్శన్ రెడ్డి, నారాయణ రెడ్డి, గాజుల శ్వేతా రెడ్డి, పందిపాడు శివ శంకర్ రెడ్డి, రైతు సంఘం రంగప్ప, తిరుపాల్, తిరుమలేష్ గౌడ్, చెట్ల మల్లాపురం మధు, బజారి, విష్ణు, నాయుడు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు

**– నగరపాలక సంస్థ అధికారి పి.విశ్వనాథ్**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో రానున్న వేసవి కాలంలో ఎలాంటి తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారి పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అశోక్‌నగర్‌లోని నీటి శుద్ధి కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. నీటి శుద్ధి ప్రక్రియలో ఉపయోగించే ఫెర్రిస్ ఆలమ్, లిక్విడ్ క్లోరిన్ గ్యాస్ సిలిండర్ల వినియోగంపై పూర్తి స్థాయి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. శుద్ధి కేంద్రంలోని ఎలక్ట్రికల్ మీటర్లు, స్క్రాబ్ యూనిట్‌ను పరిశీలించి, భద్రతా పరంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టాక్ నిల్వ పట్టికలు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించి, ఎటువంటి లోపాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగర తాగునీటి సరఫరా వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. లీకేజీలు, సరఫరా సమయం అంశాలపై పూర్తి స్థాయి పర్యవేక్షణ పెట్టాలని సూచించారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో 0.15 టీఎంసీ, సుంకేసుల ప్రాజెక్టులో 1.2 టీఎంసీ నీటి నిల్వలపై ఎప్పటికప్పుడు జలవనరుల శాఖతో సమన్వయంతో ఉండాలని తెలిపారు. గాజులదిన్నె ప్రాజెక్టులో 1 టీఎంసీ నీటిని నిల్వ చేసుకునేలా జలవనరుల శాఖ అధికారులతో ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ గిరిరాజ్, ఏఈ జనార్ధన్, ఇంచార్జి కేశవ్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.